ఎంపీల జీతాలు 24% పెంపు

- 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి
- కేంద్రం నోటిఫికేషన్ విడుదల

న్యూఢిల్లీ: పార్లమెంటు సభ్యుల జీతాలు 24 శాతం పెరిగాయి. ఈ పెరుగుదల 2023 ఏప్రిల్ 1 నుంచి వర్తిస్తుంది. వ్యయ ద్రవ్యోల్బణ సూచీ ఆధారంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో తెలిపింది. ప్రస్తుత ఎంపీల రోజువారీ భత్యాలను కూడా పెంచుతున్నట్లు వెల్లడించింది. మాజీ ఎంపీలకు పింఛను, ఐదేళ్లకు మించి పని చేసిన ప్రతి సంవత్సరానికి ఇచ్చే అదనపు పింఛనులను కూడా పెంచినట్లు తెలిపింది.తాజా సవరణల ప్రకారం, ఎంపీల జీతం నెలకు రూ.1 లక్ష నుంచి రూ.1.24 లక్షలకు, నియోజకవర్గం అలవెన్స్ నెలకు రూ.70,000 నుంచి రూ.87,000కు, కార్యాలయం ఖర్చుల అలవెన్స్ నెలకు రూ.60,000 నుంచి రూ.75,000కు పెరిగాయి. ఒక్కొక్క ఎంపీకి రోజువారీ భత్యం రూ.2,000 నుంచి రూ.2,500కు పెరిగింది. మాజీ ఎంపీల పింఛను రూ.31,000కు పెరిగింది. ఐదేళ్లకు మించి పని చేసిన ప్రతి సంవత్సరానికి ఇకపై నెలకు రూ.2,500 పింఛను అదనంగా లభిస్తుంది. ఎంపీలు తమ పదవీ కాలంలో ఒకసారి రూ.1 లక్ష విలువైన మన్నిక గల ఫర్నిచర్‌ను, రూ.25,000 విలువైన నాన్ డ్యూరబుల్ ఫర్నిచర్‌ను కొనవచ్చు. సెంట్రల్ ఢిల్లీలోని విఠల్‌భాయ్ పటేల్ హౌస్ హాస్టల్, టూ బెడ్‌రూమ్ ఫ్లాట్స్ వరకు రకరకాల వసతి సదుపాయాలను కూడా పొందవచ్చు. నీరు, విద్యుత్తు, టెలిఫోన్, ఇంటర్నెట్ ఛార్జీలను కూడా పొందవచ్చు. ఎంపీలు, వారి కుటుంబ సభ్యులు తమ నియోజకవర్గం నుంచి ఢిల్లీకి 34 వన్ వే విమాన టికెట్లను పొందడానికి అర్హులు.

మే నుంచి ఏటీఎం చార్జీల వాత

- విత్‌డ్రాయల్స్, బ్యాలెన్స్ ఎంక్వైరీపై పెరగనున్న చార్జీలు

న్యూఢిల్లీ: ఏటీఎంలో నగదు ఉపసంహరణ, బ్యాలన్స్ చెక్ లావాదేవీలపై చార్జీలు మే 1 నుంచి పెరుగుతాయి. ఖాతా ఉన్న హోం బ్యాంక్ నెట్‌వర్క్ ఏటీఎం నుంచి కాకుండా ఇతర బ్యాంక్ నెట్‌వర్క్‌లోని ఏటీఎం నుంచి లావాదేవీలను జరిపే వారిపై ఈ భారం పడుతుంది. ఇతర బ్యాంకుల ఏటీఎంల ద్వారా మెట్రో నగరాల్లో నెలకు 5 లావాదేవీలు, నాన్ మెట్రో ప్రాంతాల్లో నెలకు మూడు లావాదేవీలు ఉచితంగా జరుపుకోవచ్చు. ఈ పరిమితి దాటిన తర్వాత జరిపే ప్రతి లావాదేవీపైనా అదనపు భారం పడుతుంది. నగదు ఉపసంహరణ రుసుము ప్రతి లావాదేవీకి రూ.17 నుంచి రూ.19కి పెరుగుతుంది. బ్యాలన్స్ ఎంక్వైరీ ఫీజు ప్రతి లావాదేవీకి రూ.6 నుంచి రూ.7కు పెరుగుతుంది. నిర్వహణ వ్యయాలు పెరుగుతున్నందు వల్ల ఈ రుసుములను పెంచాలని వైట్ లేబుల్ ఏటీఎం ఆపరేటర్లు చాలా కాలం నుంచి కోరుతున్నారు.

అస్సాంలో పేపర్ లీక్.. 11వ తరగతి పరీక్షలు రద్దు

- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు విద్యార్థి సంఘాల డిమాండ్

గువాహటి: బీజేపీ పాలిత అస్సాంలో 11వ తరగతి పరీక్ష పేపర్లు లీక్ అయ్యాయి. దీంతో ప్రభుత్వం పరీక్షలన్నింటినీ రద్దు చేసింది. ఈ నెల 24 నుంచి ఈ నెల 29 వరకు జరిగే మొత్తం 36 సబ్జెక్టుల పరీక్షలన్నిటినీ రద్దు చేసినట్లు విద్యా శాఖ మంత్రి రనోజ్ పెగు చెప్పారు. దీనిపై విద్యార్థి సంఘాలు ఎన్ఎస్‌యూఐ, ఎస్ఎఫ్ఐ, ఎస్ఎంఎస్ఎస్, ఏఏఎస్‌యూ స్పందిస్తూ, అస్సాం ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించాయి. విద్యా శాఖ మంత్రి పెగు తన పదవికి రాజీనామా చేయాలని, రాష్ట్ర పాఠశాల విద్యా మండలి చీఫ్ ఆర్‌సీ జైన్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశాయి.

కేరళ బీజేపీ చీఫ్‌గా రాజీవ్ చంద్రశేఖర్

తిరువనంతపురం, మార్చి 24: కేరళ బీజేపీ నూతన అధ్యక్షుడిగా కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఎన్నికయ్యారు. ఈ మేరకు బీజేపీ అధిష్టానం సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కేంద్ర పరిశీలకుడిగా హాజరైన ప్రహ్లాద్ జోషి ఇక్కడ జరిగిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన పేరును వెల్లడించారు. రాష్ట్రానికి చెందిన పలువురు బీజేపీ నాయకులు, రాష్ట్ర ఇన్‌చార్జ్ ప్రకాశ్ జవదేకర్ సమక్షంలో ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు కే సురేంద్రన్ నుంచి అధ్యక్ష బాధ్యతల్ని చంద్రశేఖర్ అందుకున్నారు. ఈ సందర్భంగా సురేంద్రన్ మాట్లాడుతూ, గత 10 ఏండ్లలో కేరళలో బీజేపీ పెద్ద ఎత్తున విస్తరించిందని అన్నారు. పార్టీ నాయకులంతా చంద్రశేఖర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. 2024 పార్లమెంట్ ఎన్నికల్లో తిరువనంతపురం స్థానంలో పోటీ చేసిన చంద్రశేఖర్, శశిథరూర్ చేతిలో 16 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు.

చీతాలపై రాళ్ల దాడి

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్‌లోని షియోపూర్ జిల్లాలో సోమవారం ఆడ చీతా జ్వాల, దాని నాలుగు పిల్లలపై రాళ్ల దాడి జరిగింది. చీతాల సంఖ్యను పెంచాలనే లక్ష్యంతో ఆఫ్రికా నుంచి రప్పించి ఈ జిల్లాలోనే పెంచుతున్నారు. అధికార వర్గాలు తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 9 గంటల సమయంలో ఈ చీతాలు ఓ పొలంలోని ఆవు దూడను వేటాడే ప్రయత్నం చేశాయి. దీనిని గమనించిన స్థానికులు పెద్ద ఎత్తున శబ్దాలు చేశారు. ఒకరిద్దరు వాటిపై రాళ్లు విసిరారు. వీటిని పర్యవేక్షిస్తున్న బృందం అవాంఛనీయ సంఘటన జరగకుండా నిరోధించింది. ఈ శబ్దాల వల్ల చీతాలు తిరిగి అడవిలోకి పారిపోయాయి. తల్లీబిడ్డలు ఆరోగ్యంగా, సురక్షితంగా ఉన్నాయి.

పూలే, సావిత్రీబాయికి భారత రత్న ఇవ్వాలి

- మహారాష్ట్ర శాసనసభ తీర్మానం

ముంబై: సంఘ సంస్కర్తలు మహాత్మా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలేలకు దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారత రత్న' ఇవ్వాలని కోరుతూ మహారాష్ట్ర శాసనసభ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు సోమవారం ఏకగ్రీవంగా ఓ తీర్మానాన్ని ఆమోదించింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మాట్లాడుతూ, మన దేశంలో 'మహాత్మా' బిరుదు అన్నింటి కన్నా గొప్పదని చెప్పారు. ఇది కేవలం ఇద్దరు వ్యక్తులకు మాత్రమే ఉందన్నారు. ఒకరు మహాత్మా పూలే కాగా, మరొకరు మహాత్మా గాంధీ అని చెప్పారు. 'భారత రత్న' అనేది రాజ్యం ఇచ్చే గుర్తింపు, గౌరవమని పేర్కొన్నారు.

చెన్నై ట్రాఫిక్ పోలీసులకు ఏసీ హెల్మెట్లు

చెన్నై: వేసవి కాలంలో శిరస్త్రాణాల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు వర్ణనాతీతం. మండుటెండల్లో విధులను నిర్వహించే ట్రాఫిక్ పోలీసుల కష్టాలను ఉన్నతాధికారులు గుర్తించారు. చెన్నైలోని అవడి సిటీ పోలీసులు ఎయిర్-కండిషన్డ్ హెల్మెట్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇవి మైనస్ 15 డిగ్రీల సెల్సియస్ చల్లదనాన్ని, 10 డిగ్రీల సెల్సియస్ వెచ్చదనాన్ని ఇవ్వగలవు. వీటిని ధరించినవారి మెడ క్రింది భాగం కన్నా తల భాగంలో మూడు రెట్ల చల్లదనాన్ని ఇస్తాయి. అందువల్ల తలనొప్పి, అలసట వంటివి తగ్గుతాయి. ఎయిర్ కండిషనింగ్‌ను ఆన్ చేసినపుడు కాస్త వైబ్రేషన్ వస్తుందని అవడి సిటీ పోలీస్ కమిషనర్ కే శంకర్ చెప్పారు. తమ పరిధిలో పని చేస్తున్న 334 మంది ట్రాఫిక్ కానిస్టేబుళ్లలో 50 మందికి ఈ ఏసీ హెల్మెట్లను ఇచ్చామని తెలిపారు. వీటి పనితీరును విశ్లేషించిన తర్వాత మిగిలిన వారికి కూడా వీటిని ఇవ్వాలని అనుకుంటున్నామని చెప్పారు.

విద్యార్థి వీసాలకు కోత

2023-24లో 41% దరఖాస్తులు తిరస్కరించిన అమెరికా

న్యూఢిల్లీ, మార్చి 23: భారతీయ విద్యార్థులకు అమెరికా ఇచ్చే విద్యార్థి వీసాల సంఖ్య గణనీయంగా తగ్గిపోతున్నది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తరువాత వలసదారులపై కక్ష గట్టినప్పటికీ విద్యార్థి వీసాలు తగ్గడానికి మాత్రం ఆయన కారణం కాదని తెలుస్తున్నది. అమెరికా ప్రభుత్వం మొత్తంగానే విద్యార్థి వీసాలను తగ్గించగా, ఈ క్రమంలోనే భారతీయ విద్యార్థుల అవకాశాలు కూడా తగ్గిపోయాయి. 2018లో 42 వేల మంది భారతీయ విద్యార్థులకు వీసాలు (ఎఫ్-1) లభించగా, ఆ సంఖ్య 2024 నాటికి 86 వేలకు పెరిగింది. కానీ అంతకుముందు సంవత్సరాలు 2023లో 1.31 లక్షల మందికి, 2022లో 1.15 లక్షల మందికి విద్యార్థి వీసాలు లభించాయి. గత పదేండ్లుగా విద్యార్థి వీసాల మంజూరులో ఆమోదం తక్కువ, తిరస్కరణ ఎక్కువ అన్న చందంగా సాగుతున్నది. 2014లో దాదాపు 6 లక్షల వీసాలు మంజూరు చేసిన అధికారులు 1.73 లక్షల దరఖాస్తులను తిరస్కరించారు. 2023లో 4.45 లక్షల దరఖాస్తులు ఆమోదం పొందగా, 2.53 లక్షలు తిరస్కరణకు గురయ్యాయి. ఎఫ్-1 వీసాల దరఖాస్తుల తిరస్కరణ 41 శాతం పెరిగినట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2024లో చైనాను దాటి ప్రపంచంలోనే అత్యధిక విద్యార్థి వీసాలు పొందిన దేశంగా భారత్ నిలిచింది. కానీ 2018, 2023 మధ్య ఎఫ్-1 వీసాలు మంజూరు రేటు 65.03 శాతం నుంచి 63.74 శాతానికి పడిపోయింది. ఇక భారతీయుల దరఖాస్తుల తిరస్కరణ రేటు 34.97 శాతం నుంచి 36.26 శాతానికి పెరిగింది.

అంతర్జాతీయ పరిస్థితులు

ఉన్నత విద్య కోసం విద్యార్థులు ఎంపిక చేసుకునే అగ్రశ్రేణి దేశాలు కూడా తమ విధానాలను కఠినతరం చేశాయి. అటువంటి తరుణంలో అమెరికా స్టూడెంట్ వీసా తిరస్కరణలు పెరిగాయి. కెనడా 2023తో పోల్చినపుడు 2024లో స్టూడెంట్ పర్మిట్స్‌ను 35 శాతానికి పరిమితం చేసింది. అదేవిధంగా బ్రిటన్ నిరుడు నిబంధనలను కట్టుదిట్టం చేసి, భారతీయ విద్యార్థులు తమపై ఆధారపడినవారిని బ్రిటన్‌కు తీసుకురావడంపై ఆంక్షలు విధించింది. ఆస్ట్రేలియా కూడా స్టడీ వీసాలను 2023 అక్టోబరు నుంచి 2024 ఆగస్టు వరకు 38 శాతం తగ్గించింది.

అమెరికా పట్ల సన్నగిల్లుతున్న ఆసక్తి

కీస్టోన్ ఎడ్యుకేషన్ గ్రూప్ 2024 నవంబరులో నిర్వహించిన సర్వే ప్రకారం, ట్రంప్ విధానాలు, రాజకీయ సిద్ధాంతాల వల్ల విదేశీ విద్యార్థులకు అమెరికా తక్కువ ఆకర్షణీయ గమ్యస్థానంగా మారింది. వివిధ దేశాల విద్యార్థుల్లో 42 శాతం మంది అమెరికాలో చదవడం గురించి పరిశీలించడానికి ఇష్టపడలేదు.

అమెరికాకా.. జర ఆగండి!

- కఠిన ఇమ్మిగ్రేషన్ నిబంధనలపై అవగాహన ఉండాలి
- అధికారుల ప్రశ్నలకు మౌనంగా ఉండరాదు
- అమెరికా వెళ్లే పర్యాటకులకు నిపుణుల సూచనలు

న్యూఢిల్లీ, మార్చి 24: స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ దగ్గర సెల్ఫీ తీసుకోవాలని, ఎంపైర్ స్టేట్ బిల్డింగ్‌పైనుంచి నగర అందాలను వీక్షించాలని కలలు కంటున్నారా? అయితే ఒక్క క్షణం ఆగండి... అంతర్జాతీయ సందర్శకులుగా అమెరికాలో మీ హక్కులేమిటో ముందు తెలుసుకోండి. అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ మళ్లీ వైట్‌హౌస్‌లో అడుగుపెట్టిన తర్వాత తన ఎన్నికల ప్రచారంలో చేసిన వాగ్దానాల మేరకు ఆయన కఠిన ఇమ్మిగ్రేషన్ విధానాలను పునః ప్రవేశపెట్టారు. ఇటీవలి కాలంలో అమెరికాకు పయనమైన వందలాది మంది పర్యాటకులు సరిహద్దుల వద్దే బందీలుగా మారడం విదేశీ పర్యాటకులను ఆందోళనకు గురిచేస్తుండగా అమెరికా విధానాలపై ఇతర దేశాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

మొబైల్ ఫోన్లనూ చెక్ చేస్తారా?

సవ్యమైన ట్రావెల్ డాక్యుమెంట్లు ఉన్నప్పటికీ అమెరికా సరిహద్దు అధికారులు పర్యాటకులను అడ్డగించి సోదాలు చేయడం ఇప్పుడు సర్వసాధారణంగా మారింది. ఒక వ్యక్తిని దేశంలోకి అనుమతించాలా వద్దా అన్న విషయాన్ని నిర్ధారించుకోవడానికి ఎంట్రీ పాయింట్ల వద్ద ఎవరినైనా ఆడ్డుకునే అధికారం అమెరికా కస్టమ్స్ అధికారులకు ఉంది. మీరు తప్పు చేయనప్పటికీ, అనుమానాస్పదంగా కనిపించనప్పటికీ మీ లగేజీని, వ్యక్తిగత వస్తువులను తనిఖీ చేసే అధికారం వారికి ఉంది. అంతేకాదు మీ మొబైల్ ఫోన్లు, లాప్‌టాప్‌లను కూడా కస్టమ్స్ అధికారులు తనిఖీ చేయవచ్చు. కొన్ని సందర్భాలలో పర్యాటకుల ఎలక్ట్రానిక్ పరికరాల పాస్‌వర్డ్‌లను కూడా వారు అడుగుతారు. పాస్‌వర్డ్‌లను ఇవ్వడానికి పర్యాటకులు నిరాకరించిన పక్షంలో అమెరికన్ పౌరుడైతే అనుమతి లభించడానికి కొద్దిగా జాప్యం జరగడం, లేదా పరికరాన్ని తదుపరి పరిశీలన కోసం అధికారులు తమ వద్దే ఉంచుకోవడంతో సరిపెట్టవచ్చు. అదే విదేశీ పర్యాటకులు అయితే తీవ్ర పర్యవసానాలను ఎదుర్కోక తప్పదు.

వీసా రహిత దేశాల ప్రజల హక్కులు?

ఇక వీసా రద్దు కార్యక్రమం కింద దాదాపు 40 దేశాలకు చెందిన విదేశీ పర్యాటకులు టూరిజం లేదా వ్యాపార నిమిత్తం వీసా లేకుండానే అమెరికాలో 90 రోజులపాటు గడపవచ్చు. అమెరికా పౌరులు కూడా అదే తరహాలో ఆయా దేశాలకు వీసా లేకుండా వెళ్లవచ్చు. అయినప్పటికీ తమ విమానం బయల్దేరడానికి కనీసం 72 గంటల ముందు ఎలక్ట్రానిక్ సిస్టమ్ ఫర్ ట్రావెల్ ఆథరైజేషన్(ఈఎస్‌టీఏ) కోసం పర్యాటకులు దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. ఈఎస్‌టీఏ ఉన్న వారు అమెరికాలో శాశ్వతంగా చదువుకోవడానికి లేదా పనిచేయడానికి అర్హులు కారు. వారికి చాలా పరిమితమైన హక్కులు ఉంటాయి. డిపోర్టేషన్ నుంచి మాత్రం స్వల్పంగా రక్షణ ఉంటుంది.

అందుబాటులో ఉంచుకోవలసిన నంబర్లు

అమెరికాకు ప్రయాణించే అమెరికా యేతర పౌరులు తమ వెంట ఇమ్మిగ్రేషన్ న్యాయవాది లేదా అత్యవసర పరిస్థితులలో సంప్రదించవలసిన వ్యక్తి వివరాలను ఉంచుకోవాలని పౌర హక్కుల గ్రూపులు సూచిస్తున్నాయి. ఒకవేళ మిమ్మల్ని కస్టమ్స్ అధికారులు అదుపులోకి తీసుకున్న పక్షంలో అధికారుల ఆదేశాలను కచ్చితంగా పాటించడంతోపాటు తక్షణమే న్యాయ సహాయకుడిని సంప్రదించాలని వారు సూచిస్తున్నారు. సరిహద్దు ఎంట్రీ పాయింట్ల వద్ద అధికారులు ప్రశ్నించినపుడు మౌనంగా ఉండడం కూడా ఒక్కోసారి ప్రమాదాన్ని తెచ్చిపెడుతుందని వారు చెబుతున్నారు. మీ సందర్శనలో పని చేయాలని భావిస్తున్నారా అని అధికారులు ప్రశ్నించినపుడు జవాబివ్వకుండా మౌనంగా ఉంటే దేశంలోకి ప్రవేశించే అవకాశాన్ని కోల్పోవలసి వస్తుందని పౌర హక్కుల గ్రూపులు హెచ్చరిస్తున్నాయి. ప్రవేశం నిరాకరణకు గురైన పర్యాటకులు తమ దరఖాస్తులను ఉపసంహరించుకుని స్వదేశానికి వెళ్లిపోవడానికి అధికారులు అనుమతించే అవకాశం ఉంటుంది. అటువంటి సందర్భాలలో వీసా రద్దయి తదుపరి అందుబాటులో ఉన్న విమానంలో వెనక్కు పంపించివేస్తారు.

డీకే వ్యాఖ్యలపై రాజకీయ దుమారం

- రాజ్యాంగం మార్పుపై వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు, మార్చి 24: మతపరమైన రిజర్వేషన్లను కల్పించడం కోసం రాజ్యాంగాన్ని మారుస్తామంటూ వ్యాఖ్యానించి కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ రాజకీయ వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల ఒక కార్యక్రమంలో శివకుమార్ మాట్లాడుతూ 'మంచి రోజులు వస్తాయి. చాలా మార్పులు జరుగుతాయి. రాజ్యాంగం మారుతుంది' అంటూ వ్యాఖ్యానించారు. ఇందుకు సంబంధించిన వీడియోను బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వివాదం రాజుకుంది. ఈ వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేసిన బీజేపీ రాజ్యాంగాన్ని మార్చేందుకు కాంగ్రెస్ కుట్ర పన్నిందని ఆరోపించింది. ప్రజలను తప్పుదారి పట్టించేందుకు తన మాటలను బీజేపీ వక్రీకరించిందని డీకే శివకుమార్ సోమవారం వివరణ ఇచ్చారు.

పార్లమెంట్‌లో రభస

డీకే వ్యాఖ్యలు సోమవారం పార్లమెంట్ ఉభయ సభలలో రభసకు దారి తీశాయి. కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ సభ్యుల నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని మార్చాలని భావిస్తోందని బీజేపీ సభ్యులు ఆరోపించారు.

జస్టిస్ వర్మను అభిశంసించాలి

- ప్రతిపక్ష ఎంపీల డిమాండ్

న్యూఢిల్లీ, మార్చి 24: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీ స్థాయిలో నగదు బయటపడడంపై ప్రతిపక్ష నాయకులు తీవ్రంగా స్పందించారు. ఈ వ్యవహారంపై నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని కొందరు డిమాండు చేయగా జస్టిస్ వర్మను అభిశంసించాలని మరి కొందరు సూచించారు. ఇది చాలా పెద్ద విషయమని, న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకం దెబ్బతిన్నదని ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్ సోమవారం అభిప్రాయపడ్డారు. ఒక న్యాయమూర్తి నివాసంలో గుట్టల కొద్దీ కరెన్సీ కట్టలు బయటపడడం భారతదేశ చరిత్రలో ఇదే మొదటిసారని ఆయన అన్నారు. జస్టిస్ వర్మ రాజీనామా చేయాలని, ఈ వ్యవహారాన్ని దర్యాప్తు చేయాలని సంజయ్ సింగ్ డిమాండు చేశారు. ఈ అంశాన్ని పార్లమెంట్ కూడా చర్చించాలని ఆయన సూచించారు. డబ్బు దొరకకపోయినా ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పారేస్తారని, కాని కోట్ల కొద్దీ దొరికినా(ఈ కేసులో) దర్యాప్తు మాత్రం నిర్వహించరని పార్లమెంట్ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. కాగా, జస్టిస్ వర్మ వ్యవహారంపై సీజేఐ సంజీవ్ ఖన్నా కమిటీని ఏర్పాటు చేయడం ఒక ముందడుగని కాంగ్రెస్ ఎంపీ కార్తీ చిదంబరం అన్నారు. ఈ అంశంపై ప్రభుత్వం పార్లమెంట్‌లో ఓ ప్రకటన చేయాలని ఆయన కోరారు. న్యాయ వ్యవస్థపై ప్రజలలో నమ్మకం నెమ్మదిగా సడలిపోతోందని టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ వ్యాఖ్యానించారు. ప్రజలలో విశ్వాసాన్ని కల్పించాల్సిన బాధ్యత న్యాయవ్యవస్థపైనే ఉందని ఆయన చెప్పారు. ఓ సిట్టింగ్ జడ్జి రాజీనామా చేసి మరుసటి రోజు ఓ రాజకీయ పార్టీలో చేరిన ఉదంతం మనం చూశామని, ఓ సీజేఐ పదవీ విరమణ చేసి పార్లమెంట్ సభ్యుడిగా వచ్చారని ఆయన గుర్తు చేశారు. ఇదిలా ఉండగా, నోట్ల కట్టల వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో ఓ పిటిషన్ దాఖలైంది.

జస్టిస్ వర్మకు బాధ్యతల ఉపసంహరణ

జస్టిస్ యశ్వంత్ వర్మకు ఢిల్లీ హైకోర్టు సోమవారం అధికారిక బాధ్యతలను ఉపసంహరించింది. ఇదిలా ఉండగా, జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది. దీనిపై కేంద్రం ఆమోదం లభించాక. తుది ప్రకటన వెలువడనున్నది.

బదిలీకి వ్యతిరేకంగా నిరవధిక సమ్మె

అలహాబాద్ హైకోర్టుకు జస్టిస్ యశ్వంత్ వర్మను బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా మంగళవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టాలని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్‌కు చెందిన న్యాయవాదులు నిర్ణయించారు.

షిండేపై కమెడియన్ కునాల్ వ్యాఖ్యల దుమారం

కునాల్ కామెడీ క్లబ్‌పై దాడి

ముంబై. మార్చి 24 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండేపై స్టాండప్ కమెడియన్ కునాల్ కమ్రా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపుతున్నాయి. థాణే నుంచి వచ్చిన ఓ నాయకుడు.. బీజేపీతో చేతులు కలిపి శివసేనను చీల్చేశాడని, అతడు దేశద్రోహి అని వ్యాఖ్యానించారు. ముంబైలోని ఖార్ ప్రాంతంలోని ది హాబిటాట్ కామెడీ క్లబ్బులో జరిగిన కార్యక్రమంలో కునాల్ కమ్రా దిల్‌తో పాగల్ హై పాటను రాజకీయ పేరడీ చేసి పాడారు. ఇందులో షిండేను ఉద్దేశించి ద్వంద్వ అర్థం వచ్చేలా పాడారు. ఈ సందర్భంగా షిండేను ఉద్దేశించి దేశద్రోహి అంటూ అభివర్ణించాడు. ఇది షిండే అభిమానులకు కోపం తెప్పించింది. కునాల్‌కు వ్యతిరేకంగా క్లబ్‌పై శివసేన కార్యకర్తలు దాడి చేసి, ధ్వంసం చేశారు. తక్షణమే కునాల్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కునాల్ కమ్రా వ్యాఖ్యలు దుమారం రేగడంతో శివసేన యువ సేన ప్రధాన కార్యదర్శి రాహుల్ కనాల్.. కునాల్ కమ్రా సహా రాహుల్ గాంధీ, ఆదిత్య ఠాక్రేలపై ఫిర్యాదు చేశారు. దీంతో ఈ ముగ్గురిపై పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ముందస్తు ప్రణాళికతోనే షిండేపై అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. కునాల్ క్షమాపణ చెప్పాలని సీఎం ఫడ్నవీస్ డిమాండ్ చేశారు.

2022-24 మధ్య ర్యాగింగ్ భూతానికి 51 మంది బలి

- విద్యా సంస్థల్లో ర్యాగింగ్‌పై నివేదిక

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ర్యాగింగ్ భూతానికి 2022-24 మధ్య కాలంలో 51 మంది బలైపోయారు. పోటీ పరీక్షల శిక్షణా కేంద్రం కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలతో ఈ సంఖ్య దాదాపు సమానం. సొసైటీ ఎగెనెస్ట్ వయలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ ప్రచురించిన 'భారత దేశంలో ర్యాగింగ్ పరిస్థితి, 2022-24' నివేదిక ఈ వివరాలను వెల్లడించింది. ర్యాగింగ్ ఘటనలపై ఫిర్యాదులు అత్యధికంగా వైద్య కళాశాలల నుంచి వస్తున్నాయని తెలిపింది. జాతీయ యాంటీ ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌కు 1,946 కళాశాలల నుంచి 3,156 ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో 38.6 శాతం వైద్య కళాశాలల నుంచి వచ్చాయి. ఈ ఫిర్యాదులు కేవలం హెల్ప్‌లైన్ ద్వారా నమోదైనవేనని, నేరుగా కళాశాలలు, పోలీసులకు బాధితులు చేసిన ఫిర్యాదులు ఇంకా ఎక్కువే ఉంటాయని ఈ నివేదిక రూపకర్తలు తెలిపారు. 2022-24 మధ్య రాజస్థాన్‌లోని కోటాలో 57 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. కళాశాలలు యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ నివేదిక సూచించింది. ఈ స్క్వాడ్‌ను సంప్రదించేందుకు ఫోన్ నంబరు తదితర వివరాలను కొత్త విద్యార్థులకు తెలియజేయాలని పేర్కొంది.

విద్యార్థుల ఆత్మహత్యలపై జాతీయ టాస్క్‌ఫోర్స్

- జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ చైర్మన్‌గా ఎన్‌టీఎఫ్
- ఉన్నత విద్యాసంస్థల్లో ఆత్మహత్యలపై సుప్రీం ఆదేశాలు

న్యూఢిల్లీ: ఉన్నత విద్యా సంస్థలలో వరుసగా జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల ఘటనలపై సుప్రీంకోర్టు సోమవారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించడానికి విద్యార్థుల మానసిక ఆరోగ్యానికి సంబంధించిన ఆందోళనలను పరిష్కరించడానికి ఓ జాతీయ టాస్క్‌ఫోర్సును(ఎన్‌టీఎఫ్) సుప్రీంకోర్టు ఏర్పాటు చేసింది.ఐఐటీ, ఢిల్లీలో చదువుతూ ఆత్మహత్యకు పాల్పడిన ఇద్దరు విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదులపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఢిల్లీ పోలీసులను ఆదేశించింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్ రవీంద్ర భట్ ఎన్‌టీఎఫ్ చైరపర్సన్‌గా ఉంటారని, రాష్ట్రాల ఉన్నత విద్యా శాఖ, సామాజిక న్యాయ, న్యాయ వ్యవహారాలు, సాధికారత, మహిళా, శిశు అభివృద్ధి శాఖల కార్యదర్శులు ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది. ఆత్మహత్యలకు దారితీస్తున్న కారణాలపై సమగ్ర నివేదికను అందజేయాల్సి ఉంటుందని తెలిపింది.

ఎప్పుడు కావాలంటే అప్పుడు చిల్!

- సెకన్ల వ్యవధిలో పానీయాన్ని చల్లబర్చే సెల్ఫ్-కూలింగ్ క్యాన్
- బ్రిటిష్ ఇంజినీర్ అద్భుత ఆవిష్కరణ

న్యూఢిల్లీ: స్నేహితులతో కలిసి సరదాగా పిక్నిక్‌కో లేక బీచ్‌కో వెళ్లి సేద తీరాలనుకున్నప్పుడు మన వెంట తెచ్చుకున్న శీతల పానీయాలు చల్లగా లేకపోతే చాలా నిరాశ కలుగుతుంది. ఫ్రిజ్ నుంచి బయటికి తీశాక ఏ కూల్ డ్రింక్ క్యాన్ అయినా బాహ్య ఉష్ణోగ్రత ప్రభావం వల్ల కొద్దిసేపటికే చల్లదనాన్ని కోల్పోతుంది. దీనికి బ్రిటిష్ ఇంజినీర్ జేమ్స